

జిల్లాలో ఈ ఏడాది వివిధ పంటలసాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆగస్టులో వరుణుడు ముఖం చాటేయడంతో వివిధ రకాల పంటల సాగు ముందుకు సాగడం లేదు. కాలువల ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో పంటలను కాపాడు కునేందుకు, వరినాట్లు వేసేందుకు రైతులు ఇక్కట్ల పాలవుతున్నారు. వంతువారీగా నీటిని విడుదల చేస్తున్నామని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నా పూర్తిస్థాయిలో పొలాలకు సాగునీరు అందకపోవడంతో శివారు ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు నీటికోసం, వరుణుడి కరుణకోసం ఎదురుచూస్తున్నారు.



సాగెట్టా?

ముఖం చాటేసిన వరుణుడు

- జిల్లాలో వరిసాగు అంచనా 1.65 లక్షల హెక్టార్లలో..
- ఇప్పటివరకు సాగైంది 1.28 లక్షల హెక్టార్లలో..
- శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో చేరని సాగునీరు
- చల్లపల్లి సెక్షన్ ఏఈని మార్చినా ఫలితం శూన్యం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం, చల్లపల్లి, ఘంటసాల, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, కృత్తివెన్ను, బంటుమిల్లి, గూడూరు, గుడ్లవల్లేరు, పెడన మండలాలకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. మచిలీపట్నం మండలంలోని కోన, పాతేరు, తుమ్మలచెరువు, యాదర, వాడపాలెం, కేపీటీపాలెం, కమ్మవారిచెరువు, వెంకట దుర్గాంబపురం, భవానీపురం తదితర గ్రామాలకు 9వ నెంబరు ప్రధాన కాలువకు ఉన్న బ్రాంచ్ కాలువల ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది. 4, 5, 7 నెంబర్ల కాలువలకు సాగునీటిని వంతులవారీ పద్ధతి అనిచెప్పి మూడు రోజుల క్రితం నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో ఈ కాలువల కింద ఉన్న కోన, తుమ్మలచెరువు, వాడగొయ్యి తదితర గ్రామాల్లోని పొలాలకు సాగునీరు అందుబాటులో లేక నాట్లువేసిన పొలాలకు, నారుమడులకు నీరు అందుబాటులో లేక వరి ఎండుముఖం పట్టింది. చల్లపల్లి నీటిపారుదల సెక్షన్ పరిధిలో 9వ నెంబరు కాలువ ద్వారా చల్లపల్లి, ఘంటసాల, మచిలీపట్నం, మోపిదేవి మండలాలకు సాగునీరు అందించాల్సి ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఏఈ ఈ ప్రాంతాలకు సక్రమంగా నీరు అందించలేకపోతున్నారని, ఆయనను ఇటీవల బదిలీ

వంతులవారీ పద్ధతిలోనే సాగునీటి సరఫరా

చేశారు. వేరే ఏఈని ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన 9వ నెంబరు కాలువకు నీటిని విడుదల చేయకుండా, రైతులకు అందుబాటులోకి కూడా రావడం లేదని రైతులు చెబుతున్నారు. కోన, పల్లెతుమ్మలపాలెం గ్రామాల్లోని తాగునీటి చెరువులను 9/7వ నెంబరు కాలువ ద్వారా నింపాల్సి ఉంది. ఈ గ్రామాలకు ఇంకా నీరు చేరకపోవడంతో కోన గ్రామంలోని తాగునీటి చెరువును ఇప్పటివరకు నింపనేలేదు. దీంతో ఈ చెరువులోని నీరు కలుషితమైంది. ఈ చెరువులోని నీటితో స్నానం చేస్తుంటే దురదలు వస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం టీడీపీ నాయకులు కోనలోని తాగునీటి చెరువును పరిశీలించేందుకు వెళ్లారు. గ్రామస్థులు ఈ చెరువు పరిస్థితిని, అందులోని నీటిని చూపడంతో వారు గ్రామస్థులకు ఏం సమాధానం చెప్పాలో తెలియక ఏం మాట్లాడకుండా వారు వెనుదిరిగి వచ్చేయడం గమనార్హం. వెంకటదుర్గాంబపురం గ్రామానికి ఇంతవరకు సాగునీరు చేరలేదు. దీంతో ఈ గ్రామ రైతులు ఈ సీజన్‌లో వరినాట్లు వేయాలా వద్దా అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు.

వాన కోసం ఎదురుచూపులు

ఆగస్టు నెలపూర్తవుతున్నా ఈనెలలో ఆశించిన మేరవర్షాలు నమోదు కాలేదు. దీంతోపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో ఎగువప్రాంత రైతులు సాగునీటిని అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతాలకు కాలువల ద్వారా సాగునీరు అందని స్థితి నెలకొంది. వర్షం కురిస్తే వరిపైరు ఎదుగుదలకు వాతావరణం అనుకూలంగా మారుతుందని, ఎండలు అధికంగా కాస్తుండటంతో నాట్లువేసిన పొలాల్లోని లేత స్థితిలో ఉన్న వరిపైరు చనిపోయే దశకు చేరుకుంటోందని రైతులు వాపోతున్నారు.

పెడన నియోజకవర్గంలో ఇదే పరిస్థితి

పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలంలోని నీలిపూడి, కొమాళ్లపూడి, మునిపెడ, శీతనపల్లి, కృత్తివెన్ను, లక్ష్మీపురం, యండపల్లి, చెరుకుమిల్లి తదితర గ్రామాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడంలేదు. దీంతో ఆయిల్ ఇంజన్ల ద్వారా రైతులు సాగునీటిని తోడుకుంటున్నారు. ప్రధాన కాలువలకు దూరంగా ఉన్న పొలాలకు ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని తోడాలంటే ఎకరానికి ఒక విడతకు రూ.1500 వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. బంటుమిల్లి చానల్‌లో మల్లేశ్వరం వంతెన వద్ద 5 అడుగుల మేర నీటిమట్టం ఉండి దిగువకు నీరు ప్రవహిస్తుంటే కృత్తివెన్ను మండలంలోని గ్రామాల్లోని సాగునీరు పొలాల్లోకి ఎక్కుతుంది. మల్లేశ్వరం వంతెన వద్ద నీటి ప్రవాహం కొన్ని రోజులుగా మూడున్నర, నాలుగు అడుగులకు మించి నీటిమట్టం పెరగడం లేదు. దీంతో శివారు ప్రాంతంలో ఉన్న కృత్తివెన్ను మండలంలోని గ్రామాల రైతులు సాగునీరు అందక ఇక్కట్ల పాలవుతున్నారు. బంటుమిల్లి మండలం ముంజులూరు, తదితర గ్రామాల్లో పంట పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బందుల పాలవుతున్నారు.

జిల్లాలో ఇప్పటివరకు వివిధ పంటల సాగు ఇలా

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,65,789 హెక్టార్లలో వరిసాగు జరుగుతుందని అంచనాగా ఉంది. ఇప్పటివరకు 1,28,671 హెక్టార్లలో వరి సాగు జరిగింది. మొక్కజొన్న 112 హెక్టార్లకుగాను 51 హెక్టార్లలో, మినుము 1135 హెక్టార్లకుగాను 621 హెక్టార్లలో, వేరుశెనగ 765 హెక్టార్లకు గాను 120 హెక్టార్లలో, పత్తి 300 హెక్టార్లకు గాను 170 హెక్టార్లలో, చెరకు 4310 హెక్టార్లకుగాను 1654 హెక్టార్లలో సాగు జరిగింది. అన్ని రకాల పంటలు 1,72,435 హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 1,31,288 హెక్టార్లలో సాగు జరిగింది.

దుర్గగుడిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి 1992లో దేవదాయశాఖలో చేరారు. ఆ సమయంలో ఆయన సర్వీస్ రిజిస్టర్ (ఎస్‌ఆర్)లో 'జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు కావాల్సిన పదో తరగతి విద్యార్హత మీకు లేదు. కావున ఉద్యోగంలో చేరిన రెండేళ్లలోపు ఈ పోస్టుకు కావాల్సిన విద్యార్హత పొందాల్సి ఉంటుంది' అని నమోదు చేశారు. కట్ చేస్తే.. ఆ ఉద్యోగి తాను 1986లోనే పదో తరగతి పాస్ అయ్యానని ఓ సర్టిఫికెట్ ఇచ్చి ఉద్యోగంలో కొనసాగారు. ఆ తర్వాత 1994లో ఇంటర్మీడియెట్ కూడా పాస్ అయినట్టు మరో సర్టిఫికెట్ కూడా ఇచ్చి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 2021లో అప్పటి దుర్గగుడి ఈవో భ్రమరాంబ.. నకిలీ సర్టిఫికెట్లతో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వారిలో ఈ ఉద్యోగి ఒకరు. వేటు పడటంతో ఉద్యోగాన్ని కాపాడుకునేందుకు 'నేను 1994లో ఇంటర్మీడియెట్ గుంటూరులో చదివాను. ఆ సర్టిఫికెట్ నకిలీదని తేలింది. ఆ సర్టిఫికెట్ ద్వారా నేను ఎలాంటి పదోన్నతి పొందలేదు' అని వివరణ రాసి ఇచ్చారు. ఆ తర్వాత ఆయనపై సస్పెన్షన్ వేటు ఎత్తేసి మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు.

దేవదాయ నకిలీలపై విజిలెన్స్



దొంగ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉద్యోగాలు, పదోన్నతులు

- దుర్గగుడిలో 10 మందికిపైగా ఫేక్‌లు
- ఉమ్మడి కృష్ణా జిల్లాలోనూ పదుల సంఖ్యలో..
- నకిలీలపై దృష్టి సారించిన విజిలెన్స్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య పదుల్లోనే ఉంటుందని 2019లోనే గుర్తించారు. దీనిపై దేవదాయ శాఖ సూచన మేరకు విజిలెన్స్ రంగంలోకి దిగి నకిలీలపై దృష్టి సారించింది. పక్కాగా ఆధారాలు దొరికిన ఇద్దరు సిబ్బందిని విచారించగా వారు మరికొందరి పేర్లు చెప్పారు. సమగ్ర విచారణ కోసం మరికొందరు ఉద్యోగుల వివరాలు కావాలని విజిలెన్స్ అధికారులు దేవస్థానం అధికారులను కోరారు. అదే సమయంలో రాష్ట్రంలో ఎన్నికలు జరగడం వైసీపీ అధికారంలోకి రావడం.. వెలంపల్లి శ్రీనివాస్ దేవదాయశాఖ మంత్రి కావడంతో విజిలెన్స్ విచారణ పక్కదారి పట్టింది. నకిలీలు వెలంపల్లిని ఆశ్రయించడంతో వారి నుంచి భారీగా ముడుపులు తీసుకుని విచారణను అటకెక్కించేశారు. తాజాగా దుర్గగుడితోపాటు దేవదాయశాఖలో నకిలీ సర్టిఫికెట్లతో విధులు నిర్వహిస్తున్న వారిపై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి పలు ఫిర్యాదులు వెళ్లాయి. ఆయన ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించి నకిలీల విషయం నిగ్గు తేల్చాలని కమిషనర్‌కు సూచించడంతో మరోసారి విజిలెన్స్ అధికారులు రంగలోకి దిగారు. దుర్గగుడిలో పరిపాలనా విభాగంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు రాజస్థాన్‌లోని యూనివర్సిటీల నుంచి దొంగ సర్టిఫికెట్లు పొంది వాటి ఆధారంగా పదోన్నతులు కూడా పొందారు. మరికొందరు బిహార్‌లోని యూనివర్సిటీల నుంచి నకిలీ సర్టిఫికెట్లను పొందారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ఉద్యోగులు సైతం పదోన్నతుల కోసం దొంగ సర్టిఫికెట్లు పెట్టినట్లు సమాచారం. వీరందరిపైనా విజిలెన్స్ అధికారులు విచారణ జరిపేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే పలువురు ఉద్యోగుల విద్యార్హతల వివరాలు అందజేయాలని దుర్గగుడి అధికారులను కోరినట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో పలువురు నకిలీలు..

తిరుమలగిరిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ దేవదాయశాఖ ఉద్యోగిది మరీ చిత్రమైన కథ. సదరు ఉద్యోగి 1980లో పుట్టి.. 1993లో ఉద్యోగంలో చేరినట్లు రికార్డుల్లో నమోదు చేయడం గమనార్హం. అంటే 13 ఏళ్లకే ఉద్యోగం చేరి ఈయన రికార్డు సృష్టించారు. ఈ ఉద్యోగిని 1999లో పర్మినెంట్ చేశారు. ప్రస్తుతం ఈయన గ్రేడ్-3 ఈవో పదోన్నతుల జాబితాలో చోటు సంపాదించుకుని పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. విజయవాడలో గ్రేడ్-2 ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి 18 ఏళ్లు నిండకుండానే దేవదాయశాఖలో చేరిపోయారు. 18 ఏళ్ల 2 నెలల వయసులో జూనియర్ అసిస్టెంట్‌గా రెగ్యులరైజ్ అయ్యారు. ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఈయన సూపరిండెంట్ పదోన్నతి జాబితాలో చోటు దక్కించుకున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో బదిలీల జాతర



రేపు విజయవాడలో జోన్-2 బదిలీల కౌన్సెలింగ్

- ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు జోన్-1 వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఖాళీలు
- క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఎక్కువగా భర్తీ చేయాలని మౌఖిక ఆదేశాలు
- ఉద్యోగుల కొరత వల్ల మంచినీటి పథకాల అమలుకు తీవ్ర ఇబ్బంది

గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో బదిలీలకు తెర లేచింది. బదిలీల నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఖాళీ పోస్టుల అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. సిబ్బంది కొరత వల్ల మంచినీటి పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయటం కష్టసాధ్యమవుతున్న తరుణంలో సిబ్బంది సంఖ్యను మరింత పెంచాల్సిందిగా ప్రభుత్వం ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. జోన్-2 బదిలీలు విజయవాడ సర్కిల్ కార్యాలయం వేదికగా ఈ నెల 29న జరగబోతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఎక్కువ మంది సిబ్బంది పనిచేసేలా బదిలీలు ఉంటాయా? రాజకీయ సిఫార్సులకు, డబ్బులకు మొగ్గు చూపిస్తారా అన్నది వేచి చూడాల్సిందే.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా బదిలీలు జరిగాయి. బదిలీలు, డిప్యూటేషన్ల అడ్డగోలు వ్యవహారాలతో రూ.కోట్లు చేతులు మారాయి. అక్రమ బదిలీలు కారణంగా చరిత్రలోనే చవిచూడనంత అవినీతి గత ఐదేళ్లలో చోటుచేసుకుంది. పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు చార్జ్ ఫ్రేమ్స్‌ను ఎదుర్కోవాల్సి వచ్చింది. యూనియన్ల ముసుగులో కూడా నిబంధనలకు విరుద్ధంగా గతంలో బదిలీలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఉద్యోగుల ఐచ్ఛిక బదిలీలకు అవకాశం కల్పించింది. ఆఫీసుల్లో పనిచేయటం వల్ల ఎక్కువమంది అవినీతికి అలవాటు పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆఫీసుల్లోనే ఐదేళ్లకుపైగా పనిచేస్తున్న వారికి ఫీల్డ్‌లో పోస్టింగ్‌లు కల్పించాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. వర్క్ ఎస్టిమేట్లు, కంప్లీషన్ రిపోర్టులు, ఫైనల్ బిల్స్, స్క్రూటినీ వంటి వ్యవహారాల్లో ఎలాంటి రిస్క్ లేకుండా కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు దండుకునేందుకు ఎక్కువగా ఆఫీసుల్లోనే పనిచేయటానికి ఇష్టపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రిస్క్‌లేని ఆఫీసు పోస్టులను ఎంపిక చేసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. కాబట్టి క్షేత్రస్థాయిలో సిబ్బంది సంఖ్యను పెంచాలన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలను బదిలీల కౌన్సిలింగ్‌లో పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎవరికెక్కడ పోస్టులు కల్పించాలో ముందే సిద్ధం చేశారా?

బదిలీల కౌన్సిలింగ్ నేపథ్యంలో ఎవరికెక్కడ పోస్టింగ్‌లు కల్పించాలన్నది ముందుగానే నిర్దేశితమైందని, కౌన్సిలింగ్ నామమాత్రమన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఎక్కువగా ఉపయోగించాలన్న ప్రభుత్వ ఆదేశాలను కూడా ఖాతరు చేయలేదన్న విమర్శలు వస్తున్నాయి. బదిలీలకు సంబంధించి భారీగా బేరాలు జరిగాయన్న విమర్శలు కూడా వస్తున్నాయి. ఈ ఆరోపణలలో ఎంత నిజం ఉందనేది బదిలీల కౌన్సిలింగ్ రోజున తేలిపోతుంది.

జోన్-2 పరిధిలో భారీ సంఖ్యలో ఖాళీలు

గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం జోన్-2 పరిధిలో భారీ సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జోన్-2 పరిధిలో ఎన్టీఆర్, కృష్ణా, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలు ఉన్నాయి. జోన్-2 పరిధిలో ఏఈల కేటగిరీలో 63 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో ఏఈ మూడేసి మండలాల చొప్పున పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే అత్యధికంగా 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విజయవాడ డివిజన్ పరిధిలో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మైలవరం డబ్ల్యూక్యూఎం ల్యాబ్‌లో 1, తిరువూరు 1, తిరువూరు (విస్సన్నపేట) 1, నందిగామ-1, జగ్గయ్యపేట-1, మచిలీపట్నం డీఆర్‌ఈఎం పరిధిలో 2, గుడివాడ డీఆర్‌ఈఎం పరిధిలో అవనిగడ్డ, ఘంటసాల, గన్నవరం, ఉంగుటూరు, మచిలీపట్నం, గూడూరు, పెనమలూరు, ఉయ్యూరులలో 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జోన్-2 పరిధిలో డీఈఈలకు సంబంధించి చూస్తే మొత్తం 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోనే 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఐదేళ్లు దాటి ఆఫీసుల్లో పనిచేసే వారి జాబితా ఇదే

ఏఈలకు సంబంధించి చూస్తే క్షేత్రస్థాయిలో కాకుండా గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం, విజయవాడ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఐదేళ్లకుపైగా పనిచేస్తూ కొనసాగుతున్నవారు ఉన్నారు. జోన్-2కి సంబంధించి చూస్తే కల్పన ఎస్‌ఈ ఆర్‌డబ్ల్యూఎస్‌లో 5 సంవత్సరాల 24 నెలలు, ఈఎన్‌సీ ఆర్‌డబ్ల్యూఎస్‌లో 2 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఆఫీసులోనే ఏకంగా 8 సంవత్సరాల నెలా 24 రోజుల పాటు ఆమె పనిచూస్తూనే ఉన్నారు. ఖాదర్ బాషా ఈఎన్‌సీ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో 5 సంవత్సరాల నెల రోజులు దాటి మరీ పనిచేస్తున్నారు. అనుపమ ఎస్‌ఈ ఆర్‌డబ్ల్యూఎస్‌లో 5 సంవత్సరాల నెల, ఈఎన్‌సీ ఆర్‌డబ్ల్యూఎస్‌లో 2 సంవత్సరాల 2 నెలలుగా మొత్తం 7 సంవత్సరాల 3 నెలల పాటుగా ఆఫీసుల్లోనే పనిచేస్తున్నారు. కుశాల్ కుమార్ అనే ఏఈ ఈఎన్‌సీ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో 5 సంవత్సరాల 29 రోజులు, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో 11 నెలలు, ఈఎన్‌సీ కార్యాలయంలో 1 ఏడాది 2 నెలలు చొప్పున మొత్తంగా 7 సంవత్సరాల 29 రోజులుగా ఆఫీసులలోనే పనిచేస్తున్నారు. సరోజ అనే ఏఈఈ ఈఎన్‌సీ కార్యాలయంలో గత 5 సంవత్సరాల 16 రోజులకుపైగా ఆమె ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఇలా ఆఫీసుల్లో పనిచేసే వారికి క్షేత్రస్థాయిలో పోస్టింగులు ఇవ్వటం చాలా ముఖ్యం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎక్కువ కాలం ఆఫీసుల్లో పనిచేసిన వారికి ఫీల్డ్ లెవల్‌లో స్థానాలు కల్పించాలన్న వాదనలు వస్తున్నాయి.


మిద్దె శ్రీనివాసరావు

సూపర్ మాస్టారు

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు గుడివాడ టీచర్ ఎంపిక

మచిలీపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను గుడివాడలోని ఎస్పీఎస్ మునిసిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మిద్దె శ్రీనివాసరావు జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయనను రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనవారికి రూ.50 వేల పారితోషికంతో పాటు, వెండి పతాకాన్ని సెప్టెంబర్ 3వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. వచ్చేనెల 3వ తేదీన ఢిల్లీలోని హోటల్ చాణక్యపురిలో జరిగే అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని మిద్దె శ్రీనివాసరావుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆహ్వానం పంపారు.

మిద్దె నేపథ్యమిదీ..

ఎన్టీఆర్ జిల్లా ఎ-కొండూరు మండలం పోలిశెట్టిపాడుకు చెందిన మిద్దె శ్రీనివాసరావు డీఎస్సీ-2000 ద్వారా గుడివాడ ఎస్పీఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. 9, 10వ తరగతుల భౌతిక రసాయనశాస్త్రం, 7వ తరగతి సామాన్య రసాయనశాస్త్రం పాఠ్య పుస్తకాలను ఆయన రచించారు. ఆరు సంవత్సరాల క్రితం శ్రీనిసైన్స్ మైండ్ అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉచితంగా టీచర్లకు, విద్యార్థులకు హ్యాండ్‌బుక్స్, స్టడీ మెటీరియల్, లెసన్‌ప్లాన్, ల్యాబ్ యాక్టివిటీ, ప్రాజెక్ట్ వర్క్‌లను అందిస్తూ వస్తున్నారు. బాలికల డ్రాపవుట్స్‌ను తగ్గించేందుకు మూడు లక్షల విలువచేసే స్టడీ మెటీరియల్ ఇచ్చారు. డిస్ట్రిక్ట్ ఆన్ కాస్ట్ కో-ఆర్డినేటర్‌గా రెండు సంవత్సరాలుగా పనిచేస్తూ సైన్స్ సబ్జెక్టు పట్ల అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. రెండుసార్లు జాతీయస్థాయిలో కృష్ణాజిల్లా ప్రాజెక్టులను పంపారు. 2022లో జిల్లాస్థాయిలో, 2023లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆయన ఎంపికయ్యారు.

కరెంట్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి

చల్లపల్లి, ఆగస్టు 27 : కరెంట్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతిచెందిన విషాదకర సంఘటన చల్లపల్లి మండలం పాగోలులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీపతి వెంకటేశ్వరరావు (33) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. స్థానికంగా యక్కటి రాఘవ పొలంలో పనిచేసి మధ్యాహ్నం సమయంలో తిరిగి వస్తూ ఒంటికి అంటుకున్న మట్టిని కడుక్కునేందుకు సమీపంలో ఆడుతున్న మోటారు వద్దకు వెళ్లి మట్టి కడుక్కునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన చుట్టుపక్కలవారు వెంకటేశ్వరరావును చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుని భార్య నీలవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చల్లపల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆ ఇంట అంతులేని విషాదం

వ్యవసాయ కూలీ వెంకటేశ్వరరావు మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఏడాదిన్నర క్రితమే నీలవేణితో వివాహమైంది. ఆమె ఐదు నెలల గర్భిణీ. భార్యాభర్తల దాంపత్యం తొలిదశలోనే భర్త అర్థాంతరంగా తనువు చాలించటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పుట్టబోయే బిడ్డనైనా చూసుకోకుండానే తిరిగిరాని లోకాలకు వెళ్లటంతో ఆ ఇంట అంతులేని విషాదం నెలకొంది.

రైతులకు భూసర్వే ధ్రువీకరణ పత్రాలు అందించాలి

- రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు చేయండి
- కలెక్టర్ డీకే బాలాజీ



6లో..



పాదయాత్రను ప్రారంభిస్తున్న సీపీఐ రామకృష్ణ

ప్రజారోగ్య పరిరక్షణకే పాదయాత్ర

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఎ.కొండూరు, ఆగస్టు 27 : ప్రభుత్వం ఎ.కొండూరు కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యాలను కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆధ్వర్యంలో ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్రను ఎ.కొండూరు అడ్డరోడ్డు నుంచి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎ.కొండూరు మండలం మరో ఉద్దానంగా మారుతోందని, కృష్ణా నది అతీ సమీపంలో ఉన్నా తాగడానికి గుక్కెడు నీటిని ప్రభుత్వాలు ఇవ్వలేకపోతున్నాయన్నారు. మండలంలో కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. వైసీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు.

ఎమ్మెల్యే సంఘీభావం : నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వారికి తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. సీపీఐ పాదయాత్రకు ఆయన సంఘీభవ తెలిపారు.



కిడ్నీ వ్యాధికి మరొకరు బలి

గంపలగూడెం : కిడ్నీ వ్యాధితో మరో మహిళ మృతిచెందింది. అనుముల్లంక దళితవాడకు చెందిన వేల్పుల కోటమ్మ (70) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటోంది. వ్యాధి తీవ్రత పెరిగి మంగళవారం మృతి చెందింది. నెల రోజుల్లోనే గ్రామంలో కిడ్నీ వ్యాధితో నలుగురు మృత్యువాత పడటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు గ్రామంలో సుమారు 50 మంది వరకు ఉన్నారు.


కలెక్టర్ బాలాజీకి ఆహ్వానపత్రికను అందజేస్తున్న బండి రామకృష్ణ

సెప్టెంబరు 2న 40 వేల మొక్కల పంపిణీ

» జనసేన నేత బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 27 : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నియోజక వర్గంలో 40 వేల మొక్కలు పంపిణీ చేయనున్నట్టు జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సెప్టెంబరు 2వ తేదీన మొక్కలు నాటేందుకు ఒక రోజు ముందుగా హిందూ కళాశాల ఆవరణలో మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని విద్యాసంస్థల ఉపాధ్యాయులు తమ ఆవరణలో మొక్కలు ఎన్ని కావాలో లేఖలు ఇచ్చారన్నారు. ఇంటికో మొక్క నాటే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. పర్యావరణ పరిరక్షణకు పవన్ ఇచ్చిన పిలుపు మేరకు మెగా కార్యక్రమం చేపట్టామన్నారు. సపోటా, బత్తాయి, నారింజ, అరటి, జామ, మామిడి, నేరేడు, కొబ్బరి, నిమ్మ, టేకు, పనస, దబ్బ, గులాబి, మందార, నందివర్ధన, సంపంగి, మల్లి, పారిజాతం, సన్నజాజి, కలబంద, కరివేపాకు మొక్కలను అందిస్తామన్నారు. డాక్టర్ రాళ్లపల్లి లక్ష్మణస్వామి సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు గడ్డం రాజు, మాదివాడ రాము పాల్గొన్నారు.


అమెరికాలో మీట్ అండ్ గ్రేట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల దంపతులు

అభివృద్ధికి ఎన్ఆర్ఐలు సహకరించాలి

» ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, ఆగస్టు 27: 20 ఏళ్ల పాటు వెనుకబడిన గుడివాడ అభివృద్ధికి ఎన్ఆర్ఐలు తమవంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. మంగళవారం అమెరికాలోని అట్లాంటా నగరంలో జరిగిన మీట్ అండ్ గ్రేట్ పేరుతో ఫ్రెండ్స్ ఆఫ్ రాము ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గుడివాడ అభివృద్ధికి తనవంతు కృషా చేస్తానని, ఎన్ఆర్ఐలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఏకీకృత పెన్షన్ పెద్ద మలుపు



రైల్వేస్టేషన్, ఆగస్టు 27 : ప్రభుత్వ ఉద్యోగులకు ఏకీకృత పెన్షన్ పథకం ఓ పెద్ద మలుపు అని విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు తాజాగా ప్రకటించిన ఏకీకృత పెన్షన్ పథకం వివరాలను మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరం ఈ ఏకీకృత పెన్షన్ విధానం అమలులోకి వస్తుందని తెలిపారు. ఉద్యోగ జీవితంలో ఇదొక గేమ్ ఛేంజర్ అన్నారు. ద్రవ్యోల్బణ సూచిక డీఏ వెసులుబాటు ఉంటుందని, ఉద్యోగి కుటుంబసభ్యులకు ఇది ఆర్థికభద్రతను కల్పిస్తుందని తెలిపారు. కార్మిక సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక నిపుణులతో విస్తృత సంప్రదింపులు జరిపిన తరువాతనే ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కొత్త పెన్షన్ స్కీమ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఏకీకృత పెన్షన్ విధానంలోకి మారవచ్చునని తెలిపారు. ఈ పథకం ద్వారా దాదాపు 23 లక్షల మంది ఉద్యోగులు లబ్ధిపొందుతారని ఆయన పేర్కొన్నారు. విజయవాడ డివిజన్‌లో 18 వేల మంది ఉద్యోగులకుగాను 14 వేల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కట్టా ఆనంద్ మాట్లాడుతూ, కొత్త పెన్షన్ విధానం నుంచి ఏకీకృత పెన్షన్ విధానానికి మారే అవకాశం ఉందని, ఒకసారి ఎంపిక చేసుకున్న తరువాత ఇక మరల కొత్త పెన్షన్ విధానానికి వెళ్లే అవకాశం ఉండదని తెలిపారు. బోనస్, సూపర్ యాన్యుయేషన్ గ్రాట్యుటీ అన్నింటిని ఒకేసారి చెల్లిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కొత్త స్కీమ్‌ల విధివిధానాలను, ఉద్యోగులకు లబ్ధి చేకూర్చే అంశాలను స్థూలంగా వివరించారు. సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ ఆఫీసర్ వై.సందీప్, డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, నుస్రత్ ఎం. మండ్రూపకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి వైసీపీ కార్పొరేటర్


కార్పొరేటర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పురంధేశ్వరి, సుజనా చౌదరిలు

వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ మంగళవారం బీజేపీ పార్టీలో చేరారు. విజయవాడ గాయత్రినగర్‌లోని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ, విజయవాడ అభివృద్ధి కోసం ఎవరు ముందుకు వచ్చినా కూటమి అండగా ఉంటుందని తెలిపారు. కాగా ఇప్పటికే వైసీపీ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమార్, హర్షద్, మాధురి లావణ్యలు ఎంపీ కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలో చేరారు.

మత్తు వదిలించండి

» డ్రగ్స్ పేరు వింటేనే ఉలిక్కిపడాలి

» గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై నిఘా పెట్టండి

» రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 27 : సమాజ శ్రేయస్సు దృష్ట్యా మాదక ద్రవ్యాల వినియోగంపై గట్టి నిఘా పెట్టాలని, గంజాయి రవాణా, అమ్మకాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపి మాదక ద్రవ్యాల పేరు వింటేనే ఉలిక్కిపడేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ సృజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో పూర్తిగా అణిచివేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం వుందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి నిరంతర నిఘా వుంచాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో యాంటీ నార్కోటిక్ క్లబ్‌లు ఏర్పాటు చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలను సరఫరా చేసే పెడ్లర్స్‌ను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంతటి వారైనా కేసులు నమోదు చేసేందుకు వెనుకాడబోమన్నారు. పోలీసు, రెవెన్యూ, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మండలస్థాయిలో బృందాలుగా ఏర్పడి గ్రామాలలోని పాఠశాలలు, కళాశాలల పరిసరాలలో బడ్డీకొట్లు, దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి గంజాయి, మాదక ద్రవ్యాలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి మత్తు పదార్థాలను సేవించే 136 హాట్‌స్పాట్‌లను గుర్తించడం జరిగిందన్నారు. కమిషనరేట్ పరిధిలో 1900 సీసీ కెమేరాలు ఏర్పాటు చేయగా వీటిలో 1300 మాత్రమే పని చేస్తున్నాయన్నారు. కళాజాతాల ద్వారా గ్రామాలలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా మాదక ద్రవ్యాల నియంత్రణలో మంచి ఫలితాలు సాధించే అవకాశం వుంటుందని సీపీ తెలిపారు. సమావేశంలో డీసీపీలు గౌతమి శాలి, కె.ఎం.మహేశ్వరరావు, కె.చక్రవర్తి, ఏసీసీ కె.వెంకటేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావు, విజయవాడ, తిరువూరు, నందిగామ ఆర్డీవోలు బీహెచ్.భవానీశంకర్, కె.మాధవి, ఎ.రవీంద్రరావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.మహేష్, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు, డీఈవో యు.వి.సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ జె.ఉషారాణి, ఎక్సైజ్ డీపీఈఓ బి.శ్రీనాధుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి కె.నాగమణెమ్మ, ఉద్యానవన అధికారి బాలాజీ కుమార్, డి ఎడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎస్ఎల్ రాజు, అరవ రమేష్, డాక్టర్ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్‌బాబు, హాజరైన వివిధ శాఖల అధికారులు

చవితి పందిళ్లకు ఆన్‌లైన్ అనుమతి

కృష్ణలంక : వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా అనుమతి పొందాలని, రసాయన రహిత విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ జి.సృజన సంబంధిత అధికారులకు సూచించారు. చవితి పందిళ్ల నిర్వహణ, విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై కలెక్టర్ మంగళవారం సీపీ రాజశేఖర్‌బాబుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకొనేందుకు చవితి పందిళ్లను ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పోలీసు అనుమతి తీసుకోవాల్సి వుంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను పోలీసు, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు అనుమతి మంజూరు చేయాలన్నారు. మండపాలు ఏర్పాటు చేసుకొనేందుకు కనీసం ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసుకొని వారి వివరాలు గుర్తింపు కార్డులను అందచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ స్థలమైతే స్థల యజమాని నుంచి, ప్రభుత్వ స్థలం అయితే సంబంధిత పంచాయతీ, మున్సిపల్ అధికారుల అనుమతి పొందవలసి వుంటుందన్నారు. విగ్రహం ఎత్తు, బరువు, నిమజ్జనం మార్గం, ఉపయోగించే వాహన వివరాలను ముందుగానే పొందుపరచాలన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్య మాత్రమే సౌండ్ బాక్సులను ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత మేరకు మట్టి విగ్రహాలు లేదా రసాయన రహిత విగ్రహాలను ఏర్పాటు చేసుకొనేలా నిర్వాహకులు ప్రోత్సహించాలన్నారు. పందిళ్ల వద్ద ఎటువంటి ఘర్షణ వాతావరణం తలెత్తకుండా భద్రత ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. షార్ట్ సర్క్యూట్‌లకు తావులేకుండా తనిఖీలు నిర్వహించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం ప్రాంతాల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా వుంచాలని మత్స్యశాఖ అధికారులను, ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కమిషనర్ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా మండపాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని అవసరమైన ప్రదేశాలలో క్రెయిన్‌లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

తోటకూర గోపీచంద్‌కు అభినందన



పెనమలూరు, ఆగస్టు 27 : అంతరిక్ష ప్రయాణం చేసిన మొట్టమొదటి సివిలియన్ ఆస్ట్రోనాట్ తోటకూర గోపీచంద్‌ను మంగళవారం మంత్రి పార్థసారథి, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో అంతరిక్షయాన సాహసయాత్ర చేయడం, అదీ విజయవాడకు చెందిన వ్యక్తి ఈ ఘనతకు కారణం కావడం మనకు గర్వకారణమన్నారు.

గోపీచంద్ నేపథ్యం..

విజయవాడ పోరంకికి చెందిన తోటకూర గోపీచంద్(30)అంతరిక్ష యాత్ర చేపట్టిన మొట్టమొదటి ఇండియన్ సివిలియన్ ఆస్ట్రోనాట్‌గా చరిత్రలోకి ఎక్కారు. గోపీచంద్ ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లలో స్కూలింగ్ చేసి యూఎస్‌లో ఎంబ్రీ రిడిల్ యూనివర్సిటీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేశారు. ఆయన ఎన్నో ఎమర్జెన్సీ మెడికల్ ఫ్లైట్స్‌లో ప్రయాణం చేశారు. గత మేలో బ్లూ ఆరిజిన్ కంపెనీ నిర్వహించిన ఒక మిషన్‌లో భాగంగా మన భారతదేశ ప్రతినిధిగా అందరిక్షానికి వెళ్లి వచ్చారు.

నూజివీడులో రైళ్లు ఆపాలి

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 27 : నూజివీడు స్టేషన్‌లో మరో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించాలని బాపులపాడు మాజీ జడ్పీటీసీ సభ్యుడు టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి వేగిరెడ్డి పాపారావు ఎంపీ వల్లభనేని బాలశౌరిని కోరారు. మంగళవారం గన్నవరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎంపీకి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వినతి పత్రం అందజేశారు. హైదారాబాద్, మద్రాసు, షిర్డీ నగరాలకు వెళ్లేందుకు నూజివీడు స్టేషన్‌లో గోదావరి, హౌరామెయిల్, షిరిడిసాయి ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందిగా ఉందని ఎంపీకి వివరించారు. ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే విజయవాడ, ఏలూరు, స్టేషన్ల నుండి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. గోదావరి, హౌరా చెన్నై మెయిల్, షిరిడిసాయి రానుపోను ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నూజివీడు స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పిస్తే హనుమాన్‌జంక్షన్, నూజివీడు, గుడివాడ ప్రాంత ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పాపారావు ఎంపీని కోరారు.

100 రోజులు, వార్షిక కార్యాచరణ ప్రణాళిక



కృష్ణలంక, ఆగస్టు 27 : విస్తృత ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు, ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి శాఖా 100 రోజులు, వార్షిక కార్యాచరణ ప్రణాళికలను ఖరారు చేసి, లక్ష్యాలను చేరుకొనేందుకు నిబద్ధతతో కృషి చేయాలని కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సృజన, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో వి.శ్రీనివాసరావులతో కలిసి జిల్లాస్థాయిలో శాఖలు 100 రోజులు, వార్షిక కార్యాచరణ ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు. ఇప్పటికే రూపొందించిన ముసాయిదా ప్రణాళికలపై శాఖల వారీగా చర్చించి చేర్చాల్సిన అంశాలపై మార్గనిర్దేశనం చేశారు. 100 రోజుల్లో పూర్తిచేసే అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించడంతో పాటు ఏడాదిలో చేపట్టే పనులకు సంబంధించి ప్రతిపాదనలు, లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో డాక్యుమెంట్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకొంటూ నిర్దేశించుకొన్న లక్ష్యాలను ప్రణాళికాయుతంగా సాధించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరక్టర్ జి.మహేశ్వరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డ్వామా పీడీ జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఈవో యు.వి.సుబ్బారావు, డీపీవో ఎస్‌వీ శివప్రసాద్ యాదవ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు చేయండి

» కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిహద్దులతో కూడిన భూమి సర్వే ధృవీకరణ పత్రాలను అందజేయాలని కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో మంగళవారం రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రెవెన్యూ విభాగంలో అర్జీలపెండింగ్, నీటితీరువా వసూళ్లు, భూమి మ్యుటేషన్, కౌలురైతులకు గుర్తింపుకార్డులజారీ, జిల్లాలో చౌకధరల దుకాణాలలో ఉన్న ఖాళీల భర్తీ, ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. మీకోసం కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీలు అధికంగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యల పరిష్కారంపై సరైన ఎండార్స్‌మెంట్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. భూమి సమస్యలపై అర్జీలు మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో రెవెన్యూ సదస్సులు జిల్లావ్యాప్తంగా నిర్వహించాల్సి ఉందని, ఈ సదస్సులలో భూమి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వివాదాలులేని భూములకు సంబంధించి సబ్‌డివిజన్ సక్రమంగా చేయాలని సూచించారు. వ్యవసాయ భూములు వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకునేందుకు దరఖాస్తులు వస్తే క్షేత్రస్థాయిలో అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇవ్వాలన్నారు. అనధికార లేఅవుట్లను గుర్తించి ప్లాన్ అప్రూవల్ అధికారులకు, రిజిస్ట్రేషన్ విభాగం అధికారులకు సమాచారం ఇవ్వాలని, ఈ అంశంపై ఆర్డీవోలు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఓటర్లజాబితాల సవరణ-2025ను షెడ్యూలు ప్రకారం చేయాలన్నారు. అక్టోబరు 18వతేదీలోగా ఇంటింటికీ తిరిగి ఓటర్లజాబితాల పరిశీలన ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. బందరుపోర్టు, డీఆర్‌డీవో, ఏపీఐఐసీ, వివిధ పరిశ్రమలకు భూముల కేటాయింపు తదితర అంశాలలో అధికారులు దృష్టి సారించాలని అన్నారు.


మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

నీటి తీరువాను వసూలు చేయండి

జిల్లాలో నీటితీరువాను వసూలు చేసేందుకు రెవెన్యూసిబ్బంది చొరవ చూపాలని జేసీ గీతాంజలి శర్మ అన్నారు. కౌలురైతులకు గుర్తింపుకార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆమె అన్నారు. ఈ-క్రాప్‌తోపాటు, ఈకేవైసీనికూడా సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. డీఆర్వో శ్రీదేవి, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు ఎం వాణి, పద్మావతి, డి.రాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ తోట సతీష్, కలెక్టరేట్ ఏవో సీహెచ్ ఆంజనేయులు, తహసీల్దార్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బదిలీల జాతర!

» సి'ఫార్సు'లకోసం నేతలచుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణ

పామర్రు : కూటమి ప్రభుత్వం బదిలీలకు పచ్చజెండా ఊపడంతో ఉద్యోగుల్లో సిఫార్సుల టెన్షన్ మొదలైంది. ఈ మేరకు బదిలీలకోసం తమవంతు ప్రయత్నాలు ప్రారంభించేశారు. ఉద్యోగులు వారు కోరుకున్న చోటకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో జిల్లావ్యాప్తంగా రాజకీయ పైరవీలు ఊపందుకున్నాయి. ఉద్యోగులు, సిబ్బంది ఎవరిస్థాయిలో వారు ప్రజా ప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు. తమ బదిలీ దరఖాస్తులతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చే సిఫార్సుల లేఖలను జతచేసి ఇచ్చే పనిలోపడ్డారు. ప్రజా ప్రతినిధులు కూడా తమకు అనుకూలంగా ఉండే వారిని తెచ్చుకుంటే సహాయకులుగా ఉపయోగపడతారనే అభిప్రాయంతో ఉన్నారు. అవసరమైన వారికి తక్షణమే సిఫార్సు లేఖలను అందిస్తున్నారు. బదిలీల్లో ఎటువంటి ఫిర్యాదులు, ఆరోపణలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శంగా వ్యవహరించాలని అధికారులకు ప్రభుత్వం స్పష్టం చేసింది. గడువు తక్కువ ఉండటంతో సిఫార్సులకోసం ఉద్యోగులు, అధికారులు హైరానా పడుతున్నారు. బదిలీలా జాతరలో ఎవరి ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో వెచిచూడాలి. ఉద్యోగుల బదిలీల వ్యవహారం కూటమి నేతలకు పెద్ద తలనొప్పిగా మారిందనే వాదన వినవస్తోంది. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన వారికి సైతం సిఫార్సులు చేస్తున్నారని నేతల్లో బేదాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉదయం కూలీలు.. రాత్రి వేళ దొంగలు!


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట క్రైం, ఆగస్టు 27 : వారంతా వ్యవసాయ కూలీలు.. కూలీ పని చేస్తూనే మరోవైపు జల్సాల కోసం దొంగతనాలు చేస్తుంటారు. పంటలు సాగుకు బావులు, వాగులు, చెరువులపై ఏర్పాటుచేసిన మోటార్లను ఉదయం పూట గమనించి రాత్రికి ఎత్తుకెళ్తుంటారు. ఈ ముఠాను తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్టు చేశారు.

» ఉదయం చూస్తారు.. రాత్రికి ఎత్తుకెళ్తారు

» వ్యవసాయ మోటార్ల చోరీ ముఠా అరెస్ట్

» నిందితుల్లో ఎన్టీఆర్ జిల్లా వాసి

» రూ.10 లక్షల నగదు, 31 మోటార్లు స్వాధీనం

ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26న సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీసులు మండలం కల్మలచెర్వు రోడ్డులో పరెడ్డిగూడెం వద్ద వాహనాల తనిఖీల సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన కూలీపని చేసే ఉప్పతల వాసు, మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన వేముల కోటేశ్వర్‌రావు కలిసి బైక్‌పై మఠంపల్లి వైపు నుంచి గరిడేపల్లి వైపు వెళ్తున్నారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.5లక్షలు లభించాయి. స్టేషన్‌కు తరలించి తమదైనశైలిలో విచారించగా ఏడాదిగా వారితో పాటు మఠంపల్లి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన కూలీ పని చేసే ఆకారపు వెంకటి, మఠంపల్లి మండలం సుల్తాన్‌పురతండాకు చెందిన కూలీ పనిచేసే అజ్మీర మంత్రియలతో కలిసి హుజూర్‌నగర్, చిలుకూరు, గరిడేపల్లి, పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెర్వు మండలాల పరిధిలో బావులు, చెరువులు, కుంటలు, వాగులపై ఏర్పాటుచేసిన వ్యవసాయ మోటార్లను చోరీ చేస్తున్నట్టు అంగీకరించారు. అదేవిధంగా మోటార్లను ఎత్తుకెళ్లే వీలులేనిచోట్ల మోటార్లలో కాపర్ వైర్‌ను చోరీ చేసి వాటిని ఆటోలో మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన పాత ఇనుము వ్యాపారం చేసే గడగంట్ల శ్రీనుకు వద్ద విక్రయిస్తుంటారు. కాపర్ వైరు విక్రయించగా వచ్చిన రూ.10లక్షలను నలుగురు వ్యక్తులు పంచుకున్నారు. ఇలా తమ వాటాగా వచ్చిన రూ.5 లక్షలు తీసుకుని వెళ్తుండగా పట్టుబడినట్టు ఎస్పీ తెలిపారు. వారిచ్చిన సమాచారంతో పోలీసులు ఆకారపు వెంకటి, అజ్మీర మంత్రియలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3.81లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన పాత ఇనుము వ్యాపారి శ్రీను వద్ద రూ.1.20లక్షల నగదుతో పాటు రూ.4.34లక్షల విలువైన 31 విద్యుత్ మోటార్లను, ఒక ఆటో, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పైఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్టు వెల్లడించారు. కాగా నిందితుల్లో ఉప్పతల వాసుపై ఆంధ్రప్రదేశ్‌లోని వత్సవాయి పోలీస్‌స్టేషన్‌లో అక్రమ మద్యం తరలింపు కేసు, ఆకారపు వెంకటిపై మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు, గడగంట్ల శ్రీనుపై రేషన్ బియ్యం అక్రమంగా తరలించే కేసులు గతంలో నమోదైనట్టు ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజు, గరిడేపల్లి ఎస్‌ఐలు చలగంటి నరేష్, ఈట సైదులు, సిబ్బంది నాగరాజు, రామారావు, శంభయ్య ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న మోటార్లు

దర్గాగా కబ్జా!

» ప్రభుత్వ స్థలంలో టిఫిన్ సెంటర్..

» స్థానిక వైసీపీ నేత చేతివాటం

విద్యాధరపురం : ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తారు. ప్రభుత్వ స్థలాన్ని సొంతం చేసుకున్న ఓ వైసీపీ నేత సదరు స్థలంలో ఏకంగా టిఫిన్ సెంటర్ పెట్టించి సొమ్ము చేసుకోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా టిఫిన్ సెంటర్

వివరాలలోకి వెళితే.. విద్యాధరపురం, రావిచెట్టు సెంటర్, జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్థానిక వైసీపీ నేత కబ్జా చేశాడు. సదరు స్థలంలో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసి అద్దెకు ఇవ్వడం వివాదాస్పదమైంది. కృష్ణా పుష్కరాలను పురస్కరించుకుని అప్పటి టీడీపీ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులు చేపట్టింది. దీనిలో భాగంగా నష్టపోయిన స్థల యజమానులకు పరిహారం చెల్లించింది. అయితే రావిచెట్టు సెంటర్ సమీపంలో సుమారు 45 గజాల ప్రభుత్వ స్థలంలో ఉన్న నిర్మాణాన్ని వైసీపీ నేత ఆక్రమించడమేకాక గత ఎన్నికల సమయంలో అందులో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశాడు. కోడ్ సందర్భంగా స్థానికులు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయటంతో కార్పొరేషన్ అధికారులు కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. ఈ క్రమంలో సదరు భవనాన్ని హోటల్‌కి అద్దెకు ఇచ్చాడు. సుమారు రూ.50 లక్షల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే సంబంధిత అధికారులు చోద్యంచూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకుని డివిజన్ ప్రజల అవసరాల నిమిత్తం వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.95

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

టీడీపీ పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సంగెపు రంగారావు

పెనమలూరు, ఆగస్టు 27: రోజురోజుకీ భూతాపం ఎక్కువవుతూ ప్రాణులకు కనీస ప్రాణ వాయువు కరువయిన ఈ ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతయినా ఉందని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సంగెపు రంగారావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోసాల గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామస్థులతో మాట్లాడారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ మాబు సుబాని, మల్లెంపాటి ఆంజనేయులు, కోనేరు సాంబయ్య, కోనేరు బుజ్జిబాబు, ఎందువ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలి

ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంతో ఎంపీ వల్లభనేని బాలశౌరి, యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఆగస్టు 27: ప్రతి ఒక్కరు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎంపీ నిధులు రూ.7లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలసి మంగళవారం ప్రారంభించారు. జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించి కొద్దిసేపు వ్యాయామం చేస్తూ ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు నిత్య జీవితంలో వ్యాయమాన్ని ఒక భాగం చేసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యం కోసమే ఓపెన్ జిమ్‌ను ప్రారంభించామన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఎంపీ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో గన్నవరానికి ప్రత్యేక స్థానం కల్పించాలని కోరానని దానికి ఎంపీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్ డేలో తాను పాల్గొంటే ప్రజల నుంచి 250కి పైగా అర్జీలు వచ్చాయని, వాటిలో 80శాతం పైగా భూ సమస్యల మీదనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి భూకబ్జాలపై పదికి పైగా ఫిర్యాదులు రావటం ఆవేదన కలిగించిందన్నారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ చలమలశెట్టి రమేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, దొంతు చిన్న, మండవ లక్ష్మీ, కాట్రగడ్డ అరుణకుమారి, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెంకట్రావుకు వినతిపత్రం అందజేస్తున్న పద్మశాలీ సేవా సంఘం నాయకులు

వాకర్స్‌కు సమాచారం లేకపోవటం బాధాకరం

గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రారంభానికి వచ్చిన ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావులను పీడీ ధనియాల నాగరాజు, పంచాయతీరాజ్ ఏఈ దాసు తప్పుదారి పట్టించారని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ ఆరోపించారు. మంగళవారం స్థానిక విలేకరులతో కిషోర్ మాట్లాడుతూ ఎంపీ బాలశౌరి ఓపెన్ జిమ్‌కు రూ.7లక్షలు నిధులు మంజూరు చేయగా వాకర్స్ అందరు కలసి రూ.5.50లక్షలు కలిపి జిమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీని ప్రారంభానికి వాకర్స్‌కు ఎలాంటి సంబంధం లేదని ఏఈ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. క్రీడా ప్రాంగణాన్ని అత్యద్భుతంగా దాతల సహకారంతో తీర్చిదిద్దుతుంటే కనీసం వాకర్స్‌కు జిమ్ ప్రారంభం తెలియకపోవటం బాధాకరమన్నారు. పీడీ నాగరాజు, ఏఈ దాసులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కిరణ్, ప్రసాద్, చిన్నారావు, శ్రీను, అలీభాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

మండలంలోని కేసరపల్లి శివారు వీఎస్‌పురం కాలనీలో నిర్మిస్తున్న శ్రీ భద్రావతి సమేత భావన ఋషి స్వామివార్ల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ పద్మశాలీ సేవా సంఘం నాయకులు మంగళవారం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కులదైవం అయిన భద్రావతి సమేత భావన ఋషి స్వామి కమ్యూనిటీ హాలును దాతల సహకారంతో ఇప్పటికీ 50శాతం పనులు పూర్తి చేశామని ఇంకా 50శాతం పనులు మిగిలి ఉన్నాయని చెప్పారు. తమ నిధుల నుంచి రూ.40లక్షలు మంజూరు చేస్తే మిగిలిన పనులు పూర్తి చేయాలని భావిస్తున్నామని కోరారు. కమ్యూనిటీ హాలు నిర్మాణం గురించి ఎంపీ బాలశౌరి తెలుసుకున్నారు. దామర్ల నారదముని, సామల ఆంజనేయులు, శివాజీ, వెంకటేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కొండపావులూరు సర్వే నెంబర్-6లో గత 8ఏళ్ల క్రితం కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ వారి ప్రకృతి చికిత్స, యోగా పరిశోధనా కేంద్రానికి 25ఎకరాలు భూమిని కేటాయించారని, నిధులు మంజూరు చేయించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని న్యాయవాది జాస్తి తాతారావు వినతి పత్రాన్ని అందజేశారు.



గన్నవరంలో రైతు సంఘం నాయకుల నిరసన

బీజేపీ ఎంపీ కంగనా వ్యాఖ్యలపై రైతుల ఆగ్రహం

గన్నవరం, ఆగస్టు 27: బీజేపీ ఎంపీ కంగనా రైతు ఉద్యమాలను అణిచివేయాలని వ్యాఖ్యలు చేయడంపై ఏపీ రైతు సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు సూరగాని సాంబశివరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతు ఉద్యమాలపై ఉక్కుపాదం మోపిందన్నారు. ఆ పార్టీ ఎంపీ వ్యాఖ్యలే అందుకు నిదర్శనం అన్నారు. రైతులంతా మరో ఉద్యమంలోకి రావాలన్నారు. రైతు సంఘం నాయకులు నల్లూరి ధర్మారావు, సుబ్బారెడ్డి, జాస్తి శ్రీను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కె.వెంకటేశ్వరరావు, విజయరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు విద్యార్థులకు అందుబాటులో ఉంటాం

ఎన్ఆర్ఐ సూర్యకాంత్‌ప్రసాద్



వీఆర్ సిద్ధార్థలో మాట్లాడుతున్న సూర్యకాంత ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు27: అమెరికాలో విద్యనభ్యసించే విద్యార్థులు, ఉద్యోగార్థులకు తమ సేవలు అన్నివేళలా అందుబాటులో ఉంటాయని యూనివర్సిటీ ఆఫ్ సౌత్‌ఫ్లోరిడా స్టూడెంట్ గవర్నమెంట్ ప్రెసిడెంటు గొట్టిపాటి సూర్యకాంత్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అమెరికా లాంటి ఇతర దేశాల్లో ఉద్యోగావకాశాలు పొంది స్థిరపడాలంటే నాయకత్వ లక్షణాలు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. స్థానికంగా తెలుగు విద్యార్థులు, ఉద్యోగులు అమెరికాలో నెగ్గుకు రావడానికి తాము, తమ సంఘ సభ్యులు బాసటగా నిలుస్తామని హామీ ఇచ్చారు. తమ సభ్యులు ప్రత్యేకంగా తెలుగు విద్యార్థులు, ఉద్యోగుల శ్రేయస్సు కోసమే పని చేస్తున్నామని తెలిపారు. సిద్ధార్థ కళాశాల విశ్వవిద్యాలయం స్థాయికి వెళ్లడంలో గొప్ప కృషి ఉందని కొనియాడారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత నిర్వాహకులు

నర్సింగ్ విద్యార్థినికి మానవత సాయం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 27: విజయవాడ విమ్స్‌లో బీఎస్‌సీ నర్సింగ్ చదువుతున్న పేద విద్యార్థిని నారాయణపురం గ్రామానికి చెందిన పల్లకట్టు శ్వేతకు కాలేజీ ఫీజుల నిమిత్తం మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ రూ.27వేలు ఆర్థిక సాయం మంగళవారం అందజేసింది. మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా శాఖ నిర్వాహకులు సాయాన్ని అందజేశారు. జన్యావుల గాంధీ, నెరుసు భూషణం, కూరెళ్ల సుబ్బాచారి, మరీదు వెంకటస్వామి, నారగాని కొండలరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, రామచంద్రరావు, పీవీఎస్.చలం తదితరులు పాల్గొన్నారు.

గండిగుంటలో పారిశుధ్యం అధ్వానం

గండిగుంట, ఆగస్టు 27 : గండిగుంట గ్రామపంచాయతీ పరిధిలో రోడ్లపై పేరుకుపోయిన చెత్తకుప్పలు, పొంగుతున్న మురుగు కాల్వలతో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ప్రధాన రహదారులతో పాటు ఎక్కడ చూసినా రోడ్లపక్క చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తకుప్పలు తొలగించక పోవడంతో గాలికి ఎగిరి రోడ్డుపై వెళ్లే వారిమీద పడుతున్నాయి. గ్రామాల్లో విషజ్వరాలు, టైఫాయిడ్‌లతో ప్రజలు బాధపడుతున్న పరిస్థితుల్లో పారిశుధ్యంపై పంచాయతీ ఉద్యోగులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాటూరు రోడ్డులో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే గేటు సమీపాన, ఏఎంసీ కార్యాలయం దాటిన తరువాత చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ సమీపాన దత్తాశ్రమానికి వెళ్లే సర్వీసు రోడ్డుతో పాటు, సచివాలయానికి వెళ్లే సర్వీసు రోడ్డు పక్క చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పలు చోట్ల మురుగు కాల్వలు పూడుకుపోయి మురుగు నీరు పోకుండా నిలిచి పోతుంది. అడపాదడపా వర్షాలు కురుస్తున్నందున గ్రామంలో పారిశుధ్యంపై శ్రద్ధ చూపక పోవడంపై స్థానికులుఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్డీవో కార్యాలయం గేటు సమీపంలో పేరుకు పోయిన చెత్త, దత్త ఆశ్రమానికి వెళ్లేదారిలో..



స్వామిని దర్శించుకొన్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పెనమలూరు, ఆగస్టు 27: పెనమలూరులో మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ల సమక్షంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు గోపాల కృష్ణ స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెనమలూరు వంతెన వద్ద నూతనంగా నిర్మించిన శ్రీగోపాల కృష్ణ స్వామి ఆలయం కమిటీ, గోగం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు ఆరువేల మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. అనంతరం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్, సర్పంచులు భాస్కరరావు, కాకర్ల వెంకటరత్నం, బొమ్మిడి అన్నపూర్ణ, తోటకూర ఉదయభాస్కర్, చిగురుపాటి శ్రీనివాసరావు, నెరుసు సతీష్, కోయ శ్రీహరి, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లి వేణుగోపాల స్వామి ఆలయంలో..

హనుమాన్‌జంక్షన్: వైష్ణవి కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం వీరవల్లి శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామ్‌చంద్ ఆధ్వర్యంలో త్రిమంజన కార్యక్రమం, ముంజల సేవ, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రంగనాథస్వామికి పంచామృతాభిషేకం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 27: స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీవైష్ణవ కృష్ణాష్టమి సందర్భంగా రంగనాథ స్వామికి పంచామృతాభిషేకం వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు రంగనాథస్వామి ప్రతిమకు అభిషేకం జరిపించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణబాబు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం మంగళవారం పురస్కరించుకొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు, జరిపారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారవేత్త మాదల బాబురావు కుటుంబ సభ్యులు 200 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈవో కె.శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఏఎస్సై ఆర్ లక్ష్మణరాజు

ఆకునూరు(ఉయ్యూరు), ఆగస్టు 27 : మత్తుదార్థాలకు అలవాటుపడి ఉన్నతమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఉయ్యూరు రూరల్ ఏఎస్సై ఆర్ లక్ష్మణరాజు అన్నారు. ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగవారం మత్తుపదార్థాలు, సోషల్‌మీడియా దుర్వినియోగంపై అవగాహన కా ర్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గోలి వసంతకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లక్ష్మణరాజు హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలకు సరదాగా అలవాటుపడితే తరువాత వాటికి బానిసలుగా మారితే ఆరోగ్యంతోపాటు, జీవితం సర్వనాశనం అవుతుందన్నారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ కె. ప్రియాంక మాట్లాడుతూ మత్తుపదార్థాల వల్ల ఆరోగ్యం, ఆర్థికంగా నష్టపోతారన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన బాలలు, యువతకు నవజీవన్ బాలభవన్ సంస్థ నూజివీడులో బాస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని జోనల్ కో- ఆర్డినేటర్లు ఎస్‌కె నజ్మా, ఎస్. జాకబ్‌రాజు తెలిపారు. హెచ్‌ఎం ఎన్. సలోమి, సంస్థ జోనల్ కో -ఆర్డినేటర్ జె.జ్యోతిచంద్రిక, మహిళా సంరక్షణ కార్యదర్శి సుధామణి, రవికుమార్ పాల్గొన్నారు.



గండిగుంట పెట్రోల్ బంకు సమీపంలో అసంపూర్తిగా..

సర్వీసు రోడ్డుకు మోక్షమెన్నడో..

గండిగుంట, ఆగస్టు 27 : గండిగుంట పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిపక్కన సర్వీసు రోడ్లు ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు అసౌర్యానికి గురవుతున్నారు. ఉయ్యూరు నుంచి గండిగుంట దత్తాశ్రమం మీదుగా ఆనందపురం వైపు వెళ్లే సర్వీసు రోడ్డు నిర్మాణం రెండు చోట్ల ఆగిపోయింది. ఒకచోట కంకర గుట్టలు పోసి నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంవల్ల ఉయ్యూరు వైపు నుంచి వెళ్లే వారేకాక చినఓగిరాల, ఆనందపురం నుంచి వచ్చేందుకు ద్విచక్రవాహనం కూడా వెళ్ల లేని పరిస్థితి. అదే విధంగా జాతీయ రహదారికి మరో పక్క ఆకునూరు, మూర్తిరాజుగూడెం వైపు నుంచి వచ్చే సర్వీసు రోడ్డు రైస్‌మిల్లు సమీపాన అసంపూర్తిగా నిలిచి పోయింది.

దీంతో ఆయా గ్రామాలతో పాటు కంకిపాడు వైపు నుంచి సర్వీసు రోడ్డును ఉపయోగించి వచ్చే వారికి ఈ ప్రాంతంలో ఇబ్బంది కలుగుతుంది. ఇప్పటికైనా జాతీయ రహదారుల అధికారులు స్పందించి సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

ఉయ్యూరు, ఆగస్టు 27 : ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులు, ప్రజల సూచనలు, సలహాల స్వీకరణ నిమిత్తం బుధవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కెఎస్ఆర్కె ప్రసాద్ తెలిపారు. 9959224796 సెల్ నంబరుకు ఫోన్ చేసి సలహాలు, సందేహాలు, సూచనలు తెలియజేయవచ్చని విజ్ఞప్తి చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.95

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి : కలెక్టర్

మచిలీపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయా లని కలెక్టర్ డీకే బాలాజీ యజమానులకు సూచించారు. జిల్లాపరిషత్ సమావేశపుహాలులో మంగళవారం జిల్లా ఎగుమతులు, ప్రోత్సాహకమండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లా డుతూ పరిశ్రమలలో కార్మికులు, ఉద్యోగుల రక్షణ కోసం పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. వీరపనేనిగూడెం, మల్ల వల్లి, చల్లపల్లి తదితర ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రా మికవేత్తలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు త్వరితగతిన ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాపరిశ్రమల విభాగం జీఎం ఆర్ వెంకట్రావ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాసరావు, ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ మధు, ఫ్యాక్టరీస్ చీఫ్ ఇనస్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రవిబాబుకు ఎమ్మెల్యే కాగిత పరామర్శ



పెడన : వైసీపీ నాయకుల దాడిలో గాయపడి బందరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కంచడం గ్రామ జన సైనికుడు రవిబాబును మంగళవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సీఐ యువకుమార్



విజయక్రాంతి జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న సీఐ ఈశ్వరరావు

మాదక ద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలి

● యువతకు సీఐలు యువకుమార్, ఈశ్వరరావు పిలుపు

అవనిగడ్డ, ఆగస్టు 27 : మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిర్మూలనకు యువత సహకరించాలని అవనిగడ్డ సీఐ యువకుమార్ విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల అనర్థాలు, సైబర్ నేరాలు, బాలికలపై వేధింపుల నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ యువకుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి ఎంతో మంది యువత జీవితాలు చీకటిమయం చేసిందన్నారు. డ్రగ్స్, గంజాయికి బానిసైన స్నేహితుల సమాచారాన్ని వారి తల్లిదండ్రులకు ముందుగానే తెలియజేస్తే వారి భవిష్యత్ నాశనం కాకుండా కాపాడవచ్చునని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలను వేధింపులకు గురి చేస్తే 112 నెంబర్‌కు సమాచారం అందించాలని సీఐ సూచించారు. ఎస్సై శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు సూచించారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఎస్పీ మురళీధర్ ఆదేశాల మేరకు విజయక్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాల నిరోధానికి ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గంజాయి రవాణా, మాదక ద్రవ్యాలు పదార్థాలు సేవించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ట్రాఫిక్ నియమాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం, కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివ రామప్రసాద్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చల్లపల్లి, ఆగస్టు 27 : ఆన్‌లైన్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు సూచించారు. చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవగాహన లేమి, అత్యాశలతో ప్రజలు ఆన్‌లైన్ నేరాలలో బాధితులుగా మారుతున్నారన్నారు. కొత్త నెంబర్ల నుంచి వచ్చే లింకులను తెరవొద్దన్నారు. ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లిస్తామని ఆశ చూపే ఏ విధమైన ప్రకటనలు నిజం కాదని గుర్తించాలన్నారు. మనిషి ఆశను ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు తమ కార్యకలాపాలు సాగిస్తుంటారన్నారు. ఇతర దేశాల నుంచీ వచ్చే ఫోన్‌కాల్స్ లిఫ్ట్ చేయవద్దని తెలిపారు. బ్లాక్ ట్రేడింగ్ యాప్ ద్వారా చల్లపల్లిలో ఒక వ్యక్తి రూ.26.70లక్షలు పోగొట్టుకున్నారని తెలిపారు. లోన్‌యాప్ ద్వారా ఎవరూ రుణాలు తీసుకోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు. వ్యాపారస్థులు తమ షాపుల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. సమావేశంలో చల్లపల్లి ఎస్సై పి.ఎస్‌వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పర్యావరణ హిత కార్యక్రమాలు చేపట్టండి

● ఎమ్మెల్యే మండలి పిలుపు

అవనిగడ్డ : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గంలో పర్యావరణ హిత కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. పవన్ కల్యాణ్ పుట్టిన రోజు కార్యక్ర మాల నిర్వహణపై మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. పవన్ కల్యాణ్ పుట్టిన రోజు క్లీన్ ఆంధ్ర - గ్రీన్ ఆంధ్ర కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలని, సామాజిక సేవా కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జనసేన నేతలు మండలి వెంకట్రామ్, మత్తి వెంకటేశ్వర రావు, కొండవీటి సునీత, సిద్ధినేని అశోక్ నాయుడు, గుడివాక శేషుబా బు, పూష డపు రత్నగోపాల్, మర్రె గంగయ్య, బొప్పన భాను, కుమార్ రాజా, కటికల వసంత్, నంద గోపాల్, రాజనాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.





బుద్ధప్రసాద్‌ను సత్కరించి అభినందనలు తెలుపుతున్న కోడూరు, చల్లపల్లి నేతలు

కోడూరు నేతల సత్కారం

కోడూరు : చెన్నైలో తెలుగు అసోసియేషన్ నుంచి సేవా రత్న అవార్డు అందుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కూటమి నేతలు ఘనంగా సత్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాస రావు, జనసేన పార్టీ నాయకులు ఉల్లి శేష గిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయం లో బుద్ధప్రసాద్‌ను భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు.

చల్లపల్లి నేతల సత్కారం

చల్లపల్లి : దివిసీమ రత్న మండలి బుద్ధ ప్రసాద్‌కు సేవారత్న అవార్డు పొందటం గర్వకారణమని టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల చెన్నైలో తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా రత్న అవార్డు అందుకుని మంగళవారం అవనిగడ్డ వచ్చిన బుద్ధప్రసాద్‌ను రైతునాయకులు నాదెళ్ల వెంకట నరసయ్యతో కలిసి సత్కరించారు.

టీడీపీ నేత శ్యామలయ్యకు సతీ వియోగం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాగిత

పెడన : పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్యకు సతీవియోగం కలిగింది. ఆయన సతీమణి యక్కల వెంకటనాగమ్మ (50) సోమవారం రాత్రి మృతి చెందారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మాజీ చైర్‌పర్సన్ పద్మజాకుమారి, అబ్దుల్ ఖయూం, వహాబ్‌ఖాన్, హమీదుల్లా, బాబు, పోతార్లంక నాగేశ్వరరావు, సాంబశివరావు, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, వరుదు రామకృష్ణ, పావని, నాని, పత్తిపాటి జయకృష్ణ, లక్ష్మీనారాయణ గుప్తా, రాధాకృష్ణ, రమణ తదితరులు ఆమె భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. శ్యామలయ్యను పరామర్శించారు.

ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా సేవలందించాలి

పెడన రూరల్ : విషజ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆరోగ్య సిబ్బంది మరింత బాధ్యతగా సేవలు అందించాలని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ మాట్లాడుతూ తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రత్యేక నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. విద్యుత్ అవసరాలు తీర్చేందుకు సోలార్ విధానాన్ని ప్రవేశ పెడుతున్నామని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. వైఎస్ ఎంపీపీ యాదమరెడ్డి వరప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు దావు గంగ, బొడ్డు గురునాథం, ఎంపీడీవో రెడ్డయ్య, సర్పంచులు దావు భైరవలింగం, బొడ్డు చినబాబు, కార్యదర్శి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



చల్లపల్లి : పంచాయతీ పారిశుధ్య కార్మికులు 40 మందికి స్థానిక పురోహిత ప్రముఖుడు వేమూరి శ్రీనివాస రావు - మహాలక్ష్మి దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. కుమారుడు వేమూరి రేవంత్ జ్ఞాపకార్థం పారిశుధ్య కార్మికులకు దుప్పట్లతో పాటు మగవారికి టవల్స్, ఆడవారికి జాకెట్ ముక్కలను అందజేశారు. సర్పంచ్ కృష్ణకుమారి, టీడీపీ నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, మోర్ల శివ, పండితులు కాశీభట్ల బాలకృష్ణశర్మ, ఈవో పి.వి.మాధవేంద్రరావుల చేతుల మీదుగా దుప్పట్లను కార్మికులకు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ కె.సుధాకర్, దాతల కుటుంబ సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజేశ్వరికి బుద్ధప్రసాద్ పరామర్శ

అవనిగడ్డ రూరల్ : పతీ వియోగం కలిగిన మాజీ ఎంపీపీ సింగం రాజేశ్వరిని మోదుమూడిలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, బచ్చు వెంకట్‌నాథ్ ఆయన వెంట ఉన్నారు.

ఎమ్మెల్యే వర్లను కలిసిన గురజాల అభిమానులు

పామర్రు : ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించి వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాను గుంటూరు జిల్లా గురజాల నియోజకవర్గ వర్ల అభిమానులు మంగళవారం కలిసి ఆనందం పంచుకున్నారు. బెజవాడ గుణదల మేరిమాత మందిరంలో మొక్కు చెల్లించుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో పేరు పోగు మరియబాబు, చుండు వాసు, చలవాది శంకర్, సైదులు, చింతకాయల పేతురు ఉన్నారు.

మెగా పవర్ ఫీస్ట్ 1న

● ఎమ్మెల్యే మండలికి ఆహ్వానం

అవనిగడ్డ : సెప్టెంబరు 1వ తేదీన విజయవాడలో జరిగే మెగా పవర్ ఫీస్ట్ వేడుకలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను ఆహ్వానించారు. అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి అభినందన సభ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేశారు. అఖి ల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు సోడిశెట్టి కృష్ణప్రసాద్, లకనం శ్యాంప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇల్లూరి సుగుణబాబు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానం అందజేశారు.



శివరామకృష్ణ క్షేత్ర నిర్మాణానికి రూ.1,01,116 విరాళం

కోడూరు : కోడూరులో శివరామకృష్ణ క్షేత్ర నిర్మాణానికి కోట రంగరాజ పెరుమాళ్ల కుటుంబసభ్యులు రూ.1,01,116 విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, జూపూడి సుభాష్ చంద్రబోస్ మంగళవారం విరాళాన్ని అందుకున్నారు. నిర్మాణ కమిటీ సభ్యులు బూరగడ్డ హరినాథ్ బాబు, బడే భావన్నారాయణ, అన్నం శివరామకృష్ణ, ఉల్లి రంగారావు పాల్గొన్నారు.

గోరువెచ్చని సూరీడు

కవితా సంపుటి ఆవిష్కరణ నేడు

నాగాయలంక : ప్రముఖ పాత్రికేయుడు, కవి జి.సూర్యనారాయణ రచించిన 'గోరు వెచ్చని సూరీడు' తొలి కవితా సంపుటిని ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ఆవిష్కరించనున్నట్లు దివిసీమ సాహితీ సమితి ప్రతినిధి డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి జి.వి.పూర్ణచంద్ పాల్గొంటారన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చల్లపల్లి : ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఏవో జి.సాయిసింధు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలను సరిచూశారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సెప్టెంబరు 15 పంట నమోదుకు ఆఖరు తేదీ అన్నారు.

విద్యార్థినులకు యూనిఫాం వితరణ

గుడ్లవల్లేరు : అంగలూరుకు చెందిన దుగ్గిరాల శివరావు, శ్యామలాంబ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు దుగ్గిరాల ప్రభాకరరావు ఇంటర్మీడియట్ విద్యార్థులకు యూనిఫామ్ అందజేశారు. అంగలూరు బాలికోన్నత పాఠశాల ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నూతన వస్త్రాలను గ్రామ సర్పంచ్ రవి కుమార్, ఉపసర్పంచ్ త్రిపురనేని సురేష్, చంద్రాల పీఏసీఎస్ చైర్‌పర్సన్ దుగ్గిరాల శేషుబాబు చేతులమీదుగా బహుకరించారు.

గుడివాడలో కేంద్ర బృందం పర్యటన



చౌటపల్లిలో జల్ జీవన్ మిషన్ పనుల వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం

గుడివాడ రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర పథకాల అమలు తీరును జల్ జీవన్ మిషన్ కేంద్ర బృందం సభ్యులు కె.రాఘవేంద్ర, కె.సుధీర్ కుమార్ పరిశీలించారు. చౌటపల్లి, బిళ్లపాడు, చిరుచింతల తదితర గ్రామాల్లో మంగళవారం వారు పర్యటించారు. తాగునీరు, పారిశుధ్యం, జల్ జీవన్ మిషన్ పథకం ఏ విధంగా అమలు జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి కుళాయిలు వేశారా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుడివాడలో తాగునీటి పరీక్ష విధానాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ, డీఈ శ్రీనివాసరావు, ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, చౌటపల్లి సర్పంచ్ రమ్య, చిరుచింతల సర్పంచ్ వీరరామవయ్య, బిళ్లపాడు గ్రామ ప్రత్యేక అధికారి బోలెం అనంతలక్ష్మి, కార్యదర్శులు అనుల, హరికృష్ణ, గ్రామస్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

బంటుమిల్లి : పాడి రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ ధ్యేయమని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మల్లేశ్వరం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘంలో రూ.87 వేల విలువ చేసే నానో మిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం 239 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.66,750 బోనస్ పంపిణీ చేశారు. యూనియన్ పాలకవర్గ సభ్యులు అర్జా వెంకటనగేష్, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యానారాయణ, సంఘం అధ్యక్షురాలు పేపేటి వీరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వీరబాబు, సూపర్‌వైజర్ వరప్రసాద్, మల్లికార్జున్, అనేష్, వేతన కార్యదర్శి చింతయ్య, టెస్టర్ గణేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కంగనా వ్యాఖ్యలకు రైతు సంఘాల నిరసన

బంటుమిల్లి : రైతులు, రైతు సంఘాలు చేసిన పోరాటాలపై ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ మంగళవారం లక్ష్మీపురం సెంటర్‌లో రైతు సంఘాలు నిరసన తెలిపాయి. గౌరిశెట్టి నాగేశ్వరరావు, మాజేటి శివశ్రీనివాసరావు, సుజ్ఞానం జనార్దన్, పట్టపు ఏసుబాబు, గౌరిశెట్టి వెంకటేశ్వరరావు, వెంకన్న, బాబురావు, నారాయణరావు, ప్రసాదు, శ్యామలరావు, కన్నారావు, పొదిలివెంకన్న, సుంకర వెంకన్న, నాగమల్లేశ్వరరావు, అజయ్‌ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళేశ్వరస్వామి సేవలో ఎంపీ బాలశౌరి



ఘంటసాల : శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వరస్వామిని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎంపీ బాలశౌరి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు శేషవస్త్రంతో ఆయనను సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. బాలకోటేశ్వరరావు, తుమ్మల చౌదదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), ముప్పనేని రవి ప్రసాద్, కాట్రగడ్డ శ్రీనివాస చక్రవర్తి, వేమూరి గోవర్ధన్, వేమూరి సాయి వెంకటరమణ, గుడివాక శేషుబాబు, కుంపటి చిట్టిబాబు, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు తాడికొండ సాయి తేజ - జ్ఞాన భవాని దంపతులను ఆయన ఆశీర్వదించారు.

రైల్వే స్టేషన్ వద్ద విద్యార్థుల స్వచ్ఛతా సేవ



మచిలీపట్నం టౌన్ : కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మచిలీపట్నం లేడీ యాంప్తిల్, నోబుల్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రైల్వే స్టేషన్ వద్ద స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ విద్యార్థులను అభినందించారు. 19వ డివిజన్ కార్పొరేటర్ దేవరపల్లి అనిత, నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్, లేడీయాంప్తిల్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హరనాథ్, అధ్యాపకులు మున్వర్, సురేష్, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణాశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు



కూచిపూడి, ఆగస్టు 27 : పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. మంగళవారం రోహిణి నక్షత్రంతో కూడిన అష్టమితిథి ఉండటంతో ముముక్షుజన మహా పీఠాధిపతి ముత్తేవి గౌరవ కృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.